ద్రోహి

టెంపోరావ్

హాల్లో ఫ్లోరోసెంట్ లైట్లు ప్రకాశవంతంగా వెల్గుతున్నాయి. పెద్ద సోఫాలో వనిత, గిరిజ పక్క పక్కనే కూర్చుని మాట్లాడుకుంటున్నారు.

ఇద్దరూ కాలేజీలో బి. ఎ. ఫస్టియ్యర్ చదువుతున్నారు. ధనవంతుడి ఏకైక కుమార్తె వనిత. గిరిజ ఆమె ప్రాణ స్నేహితురాలు. పేదపిల్ల. ఆమె తండ్రి ఒక మార్వాడీ దగ్గర గుమస్తాగా పనిచేస్తున్నాడు. ఎనమండుగురు పిల్లల్లో గిరిజ పెద్దది.

హైస్కూలునించీ వాళ్ళిద్దరూ కలిసి చదువుకున్నారు. టెన్త్ స్టేండర్డు పాసవగానే గిరిజ చదువు మానేస్తానంది.

"ఎందుకు మానెయ్యాలి?" వనిత అడిగింది.

"మా నాన్న చదివించలేడు. ఎనమండుగురు పిల్లలం. నాన్న తెచ్చేది మా తిండికే చాలడంలేదు" అంది గిరిజ.

ఆమెవైపు నవ్వుతూ చూసింది వనిత.

"మా నాన్న చదివిస్తే చదువుకుంటావా?"

"ఆయన కెందుకా శ్రమ!" అంది గిరిజ.

"ఇందులో శ్రమ ఏముంది? నువ్వు లేకపోతే నాకు చదవ బుద్ధి కాదు. నువ్వూ చదవాలి" అంది వనిత.

కృతజ్ఞతతో ఆమె వనితవంక చూసింది. వనిత కోరినది తండ్రి వద్దనడు. వనితకు ఏం కావలసినా తండ్రి కొని యిస్తాడు.

"చదువుతానులే, నీకోసం!" అంది గిరిజ.

అప్పటినుంచీ వనిత తండ్రి గోపాలరావు సహాయంతోనే గిరిజ కాలేజి చదువు సాగుతోంది.

వనిత టైమ్ చూసింది. ఏడు దాటింది.

"ఇంకా నాన్న రాలేదు!" అంది వనిత.

"ఆయన బిజీ యిండస్ట్రియలిస్టు, వనితా, డోంట్ ఫర్ గెట్!" అంది గిరిజ.

అప్పుడే కారొచ్చి పోర్టికోలో ఆగింది. కారు తలుపును సెక్రటరీ తెర్చాడు. ఆతడు కిందకు దిగాడు. నవ్వుతూ హుషారుగా హాల్లోకి నడిచి మొదట తన కూతుర్నీ, తర్వాత గిరిజనీ చూశాడు.

"హై బేబీస్ ఎలా వున్నారు?" అన్నాడతను.

వెళ్ళి వాళ్ళమధ్య కూర్చున్నాడతను. వనిత భుజం మీద చెయ్యివేసి, బుగ్గమీద ముద్దెట్టుకున్నాడు.

"ఆలస్యంగా వచ్చావు నాన్నా!" అందామె.

"పనమ్మా! తరగని పని!"

సెక్రటరీ వాళ్ళముందు కొచ్చాడు.

"ఈ పాకెట్లు మీ గదిలో పెట్టనా?" అడిగాడతను.

సెక్రటరీ మోహన్ యువకుడు, ఆదే భవనంలో కింద

నున్న ఒక గదిలో ఉంటున్నాడతను. అక్కడే భోజనం చేస్తూ ఉంటాడు. అందువలన ఎప్పుడు రావలసినా అతను గోపాలరావుకు అందుబాటులో వుంటాడు.

"మోహన్, అవి యిలా పట్రా!" అని గోపాలరావు కూతురివైపు తిరిగాడు.

"ఢిల్లీనుంచి నీకు ఏం తెప్పించానో చూడు!" అన్నాడతను.

ఆమె తండ్రివైపు ఆత్రంగా చూసింది.

ఒక పాకెట్ తెర్చి మెరుస్తూన్న హేండ్ బాగ్‌ను అతడు కూతురికి యిచ్చాడు.

"చాలా బాగుంది, నాన్నా. ఐ లైకిట్!" అంది నవ్వి.

"నీకు నచ్చుతుందని నాకు తెలుసు. అందుకే ఒక మిత్రుడిని తెచ్చిపెట్టమన్నాను."

ఆమె తండ్రికేసి చూసింది.

"గిరిజకో?" అందామె.

గోపాలరావు నవ్వుతూ మరో పాకెట్ తెర్చాడు. మరో హేండ్ బాగ్‌ను గిరిజ కిచ్చాడు.

"చాలా బాగుంది, అంకుల్" అందామె.

అతడు సంతోషంగా యిద్దర్నీ గమనిస్తూ క్షణకాలం వుండిపోయాడు. తన కూతురికి ఏమిచ్చినా గిరిజకుకూడా యివ్వాలి. అంతవరకూ ఆమె ఆనందించదు! వాళ్ళిద్దరి స్నేహం ఏ నాటిదో! ఎన్ని జన్మలనుంచి సాగుతున్నదో!

"సార్, నేను నా గదికి పోవచ్చా?" అడిగాడు సెక్రటరీ.

"ఆల్ రైట్ వెళ్ళు! గుడ్ నైట్!" అన్నాడు గోపాలరావు.

వనజ తిరిగి వెళ్ళిపోతున్న అతడివైపు గోపాలరావు మౌనంగా చూశాడు.

గోపాలరావు సోఫాలోంచి లేచాడు.

"నేను ఇంటికి పోతాను" అంది గిరిజ లేస్తూ.

ఆమె చెయ్యి పట్టుకుని లాగి కూర్చోబెట్టింది వనిత.

"వెళ్ళి అక్కడ ఏం చేస్తావు? భోజనం చేశాక వెళ్దువుగాని" అంది వనిత.

"ఎవరో నన్ను దింపాలి!"

"గిరిజను వుండమను నాన్న. నేను కారులో వెళ్ళి దింపుతాను" అంది వనిత.

"ఉండమ్మా, గిరిజా! ఇద్దరూ మాట్లాడుకుంటూ వుండండి. నేను పైకి వెళ్ళి స్నానం చేస్తాను" అని అతడు మెట్లవైపు నడిచాడు.

విశాలమైన పడగ్గదిలోకి వెళ్ళాడు. గోడకు అమర్చిన లైఫ్‌సైజు ఆయిల్ పెయింటింగ్ వైపు చూస్తూ నిలబడి పోయాడు. పద్మ పట్టుచీరతో వుండి, మెళ్ళో నగలు మెరుస్తున్నాయి. ఆమె ప్రశాంతంగా నవ్వుతోంది.

"పద్మా! పద్మా!" అనుకుంటూ అతడు సోఫాలో కూర్చుని, పెయింటింగ్ వైపు చూస్తూ ఉండిపోయాడు.

ఆమె అతడి జీవితంలోంచి శాశ్వతంగా తొలగి పోయింది. పదెనిమిదేళ్ళు దాటాయి. వనితను కని ఆమె కళ్ళు మూసింది. అప్పటినుంచీ వనితకు తల్లీ, తండ్రీ తనే!

అతడి మెదడులో ఏవో జ్ఞాపకాలు మెదులుతున్నాయి. ఆమెను ప్రేమించి అతడు పెళ్ళిచేసుకున్నాడు. ఆమె ధనవంతుల బిడ్డకాదు.

ఒకనాటి రాత్రి జోరుగా వర్షం కురుస్తోంది. అతడు కారులో వెళుతున్నాడు. బస్టేండులో ఒంటరిగా ఒక

యువతి నిలబడివుంది. వర్షంలో ఆమె ధరించిన దుస్తులు బాగా తడిశాయి. కారు హెడ్ లైట్ల కాంతిలో నక్షత్రంలా మెరుస్తూన్న ఆమె మొహం అతడికి కనిపించింది. అతడు అమాంతంగా కారు ఆపాడు. కారులోంచి ఆమె వైపు చూశాడు.

"తడిసిపోతున్నారు. ఇలా కూర్చోండి" అన్నాడు కారు తలుపు తెర్చి.

ఆమె కారులో కూర్చోలేదు. అలాగే నిలబడింది. సీటుమీద జరిగి ఆమె వున్నవైపు అతడు దిగాడు. ఆమె ముందుకు వెళ్ళాడు.

"కారులో ఎక్కి కూర్చోండి, తడిసిపోతున్నారు" అన్నాడతను.

"మీరూ తడుస్తున్నారు!" అందామె.

"మీరు భయపడకండి. కాస్సేపు కార్లో కూర్చుంటే వాన తగ్గాక దిగిపోవచ్చు."

రోడ్డు లైటు కాంతిలో ఆమె అతడివైపు చూసింది. ఇంకా ఆమె సంశయిస్తోంది.

చటుక్కున ఆకాశంలో మెరుపు మెరిసింది. కాస్సేపట్లో భయంకరమైన ఉరుములు ధ్వనించాయి. అతడు కారువైపు కదిలాడు. ఆమె కారులో ఎక్కాక తలుపు మూశాడు. అటువైపుకు వెళ్ళి అతడు కారులో కూర్చుని తలుపు మూశాడు.

కారు అద్దాలన్నీ ఎత్తి వున్నాయి. ముందు అద్దంలోంచి చూస్తే ఏమీ కనపడ్డంలేదు. అతడు లోపలున్న ఫాన్ ఆన్ చేశాడు. కారు లోపల చల్లటిగాలి వీస్తోంది.

అతడు ఆమెవైపు తిరిగాడు.

"మీరు ఎక్కడికి వెళ్ళాలి?"

"అమ్మకి జ్వరంగావుంది. డాక్టర్ కోసం వెళ్తున్నా" అందామె.

"మీ డాక్టర్ ఎక్కడున్నాడు?"

"మూసా స్ట్రీట్, నంబర్ 10."

"అక్కడకు తీసుకువెళ్ళనా?"

"మీకు శ్రమకల్పించడం నాకిష్టంలేదు."

"డోంట్ బాదర్" అని అతడు కారును పోనిచ్చాడు.

ఆమె మౌనంగా కూర్చుంది. పక్కనున్న వ్యక్తి ఎటువంటివాడో! తన్ని ఏం చేస్తాడో!

డాక్టర్ యింటిముందు అతడు కారాపాడు. ఆమె దిగి వేగంగా వెళ్ళిపోయింది. పది నిమిషాలు తర్వాత ఆమె తిరిగొచ్చింది. అతడు తలుపు తెరిచాడు.

"మీరింకా యిక్కడే వున్నారా?"

"ఎక్కండి. మీ యింటి దగ్గర దింపేస్తాను."

ఈసారి సంశయించకుండా ఆమె ఎక్కింది.

"మీ యిల్లు ఎక్కడ?"

"మీరు సాహేబ్ పేట, నాల్గో వీధి."

అతడు కారును పోనిచ్చాడు. వర్షం యింకా కురుస్తోంది.

"డాక్టరు ఏమన్నాడు?"

"రేపు ఇంటికొచ్చి చూస్తా నన్నాడు. ఇప్పుడు యివ్వడానికి ఏవో మందులు రాసిచ్చాడు."

ఒక మందుల షాపుముందు కారాపి ఆమె చేతిలో ఉన్న చీటీ అతడు తీసుకున్నాడు.

"ఇది మీ కెందుకు?" అడిగిందామె.

"మందులు కొనాలిగా" అని అతడు కారు దిగి వెళ్ళిపోయాడు.

కాన్వెంట్లో ఒక పాకెట్ తెచ్చి ఆమెకిచ్చి కారును పోనిచ్చాడు.

"నేను ఎంతివ్వాలి?"

"దిగాక యిద్దురుగాని."

ఆమె యింటిముందు కారు ఆగింది. అతడివైపు ఆమె కృతజ్ఞతతో చూసింది.

"లోపలకు రండి! అమ్మను చూడొచ్చు" అందామె.

ఆమె వెనకనే అతడు లోపలకు వెళ్ళాడు. అరవై ఏళ్ళ వృద్ధురాలు మంచంమీద పడుకుని మూలుగుతోంది.

"అమ్మా, వచ్చావా?"

ఈ వర్షంలో ముద్దయిపోయిన నన్ను ఈయన కాపాడారమ్మా. కారులో తీసుకొచ్చి ఇక్కడ దింపారు" అంది పద్మ.

తల్లి మంచం పక్కనే ఒక కుర్చీవేసి అతడిని కూర్చోమంది.

ఆ విధంగా ప్రారంభమైన పరిచయం ప్రేమగా మారింది. తండ్రితో చెప్పి అతడు పద్మను పెళ్లాడాడు. పద్మతో అతను ప్రపంచమంతా తిరిగివచ్చాడు. మూడేళ్ళ పాటు జీవితం ఆనందమయంగా సాగిపోయింది.

సీజరియన్ ఆపరేషన్ చేసి డాక్టరు బిడ్డను బయటకు తీసింది. కాని పద్మ కోలుకోలేదు.

పోతూ పోతూ ఆమె అన్న మాటలు అతడి హృదయంలో శాశ్వతంగా నిల్చిపోయాయి.

"నేను బతకను. బిడ్డకోసం, వాడికోసం మీరు మళ్ళా పెళ్ళిచేసుకోండి. చేసుకుంటారుగా!" అని అతడు జవాబిచ్చేలోపలే ఆమె మరణించింది.

అతడు మరో పెళ్ళి గురించి ఎప్పుడూ ఆలోచించ

లేదు. పద్మ యిచ్చిన బిడ్డను ప్రాణంగా చూసుకుంటూ, భార్య పేరునే స్మరిస్తూ అతడు జీవితాన్ని గడుపుతూ వచ్చాడు.

టెలిఫోన్ మ్రోగింది. తృళ్ళిపడ్తూ అతడు రిసీవర్ని ఎత్తాడు.

"నాన్నా, కిందనుంచి నేను. స్నానం చేశావా? వడ్డించమన్నాను. భోజనం చేద్దాం, కిందకు రా" అంది వనిత.

"వస్తున్నానమ్మా" అని అతడు రిసీవర్ పెట్టేశాడు.

బట్టలు మార్చుకుని, మొహం కడుక్కుని అతను కిందకు వెళ్ళాడు.

2

గదిలో వెతుకుతూ కదుల్తోంది గిరిజ.

"దేనికోసం అంతగా చూస్తున్నావు?" అడిగింది తల్లి గోదారమ్మ.

"నా కొత్త హేండ్ బాగ్ కనపడ్డంలేదు!" అంది గిరిజ.

"ఇంకెక్కడి హేండ్ బాగ్! ఆయన కంటబడింది. ఎత్తుకుపోయి, అమ్మేసి తాగేసి వుంటారు" అందామె.

గిరిజ తల్లివైపు చూసింది.

"ఈ కొంపలో బతకడం ఎలా అమ్మా? యెవరో యిచ్చిందికూడా నాన్న ఎత్తుకుపోతాడు" అంది గిరిజ విసుగ్గా.

"ఈ ఇంట్లో పుట్టడం నువ్వు చేసిన తప్పమ్మా" అంది తల్లి విచారవదనంతో.

తల్లివైపు దీనంగా చూసింది గిరిజ.

"అమ్మా, పుట్టుక, చావు మన చేతుల్లో లేవు. మనిషి

ఎక్కడో పుడ్తాడు, మరెక్కడో చస్తాడు. అమ్మా, నేను చదువు ముగించి ఏదో ఉద్యోగం చేసి నీకు సహాయపడ్తాను."

"నీ మాటకు సంతోషిస్తున్నాను" అంది తల్లి.

పుస్తకాలు తీసుకుని గిరిజ బయటకు నడిచింది. రోడ్డువెమ్మట నడుస్తోంది.

తన తండ్రి గుమాస్తాగా పనిచేసే సేట్ గోకులదాస్ ఇంటిముందునుంచి వెళ్తోంది. అప్పుడే కారులో వెళ్తూన్న గోకులదాస్ ఆమెవైపు ఆత్రంగా చూశాడు.

"ఈ అమ్మాయిని ఎక్కడో చూసినట్టుంది!" అన్నాడు డ్రయివర్ తో.

"మన ఆఫీసులో పనిచేసే గంగరాజుగారి కూతురండి" అన్నాడు డ్రయివర్.

కారు రోడ్డువెమ్మట దూసుకుపోయింది. గోకులదాస్ మెదడులో గిరిజ రూపం మెదుల్తూనే వుంది.

సాయంత్రం గంగరాజు ఇంటికి వెళ్ళబోతున్నాడు. గోకులదాస్ అతడిని పిల్చి తన గదిలోకి తీసుకెళ్ళాడు.

విశాలమైన గది. సోఫాలో కూర్చోమని గంగరాజుతో అన్నాడు. గదిలో లైటు వెలుగుతోంది. ఎదురుగా కూర్చున్నాడు సేట్. ఒక పాకెట్ ను తెర్చి అందులోని విస్కీ బాటిల్ ను గంగరాజు కిచ్చాడు.

"ఇది నీకోసం! తృప్తిగా తాగు!"

"చాలా థాంక్స్ సేట్ జీ" అన్నాడు గంగరాజు.

పదిరూపాయలు అడ్వాన్స్ అడిగితే ఇవ్వని సేట్ ఖరీదైన విస్కీ బాటిల్ని తనకివ్వడం విచిత్రంగా అనుపించింది.

"గంగరాజూ, సంవత్సరం దాటింది నా భార్య చనిపోయి. నాకు పిల్లలులేరు. పది లక్షలుపైన నాకుంది ఆస్తి. కాని ఏం లాభం? నా తర్వాత నా ఆస్తికి వారసులు లేరు!" అన్నాడతను.

సేట్ లేచి గంగరాజుకు గ్లాసు, ఒక చెంబులో మంచినీళ్ళు యిచ్చాడు.

"తాగుతూ నేను చెప్పేది విను. అప్పుడు నీ బుర్రలోకి బాగా దిగుతుంది."

గంగరాజు బాటిల్ తెర్చి గ్లాసులో విస్కీపోసి, నీళ్ళు కలిపాడు.

"మీకూ ఇవ్వనా?" ప్రశ్నించాడు.

"ఈ మత్తు ద్రవాలు నన్ను ఆకర్షించవు. నాకు కావల్సింది ఆల్కహాల్ కాదు.

గ్లాసులోని విస్కీని అతడు గడగడ తాగేశాడు.

"నీ పెద్దమ్మాయిని చూశాను. చాలా అందంగా వుంది. ఆమె పెళ్ళి గురించి ఆలోచించావా?"

మళ్ళా గ్లాసులో విస్కీ పోసుకుని, కొద్దిగా నీళ్ళు కలిపి అతడు తాగేశాడు. రెండు సిగరెట్ పాకెట్లను సేట్ అతడివైపు విసిరాడు.

"విస్కీ, సిగరెట్—మంచి జోడీ!" అని గంగరాజు సిగరెట్ వెలిగించాడు.

"నీ కూతురు పెళ్ళి విషయం చెప్పు."

"అది చదువుకుంటోంది, సార్."

"ఇంకా చదివితే ఆమె నీ మాట వినదు. ఆమెకు పెళ్ళిచేసేయడం మంచిది."

"పెళ్ళికి డబ్బు కావాలిగా!" అన్నాడు గంగరాజు.

"నేను సమకూరుస్తాను."

"పెళ్ళికొడుకు దొరకాలిగా?"

సేట్ విచిత్రంగా నవ్వాడు.

"పదిలక్షలు ఆస్తున్న నేను వున్నానుగా!"

మూడో గ్లాసు విస్కీ తాగేసిన గంగరాజుకి సేట్ మాటలు వెంటనే అర్థంకాలేదు.

"మీ సహాయం వున్నా, అబ్బాయికి అమ్మాయి నచ్చాలి!"

"నీ కూతురు నాకు నచ్చింది. నువ్వు సరే అంటే నేనామెను పెళ్ళాడ్తాను. నా వయసు నలభయ్యే. అటు పైన నీకు ఏ సమస్యలూ వుండవు. నీకు కావలసినన్ని బాటిల్సు నేను కొని యిస్తాను. మీ ఇంటికికూడా మాసం మాసం కొంత డబ్బు యిస్తాను. ఒకమ్మాయి పెళ్ళితో నీ జీవితం మారిపోతుంది. నీ కుటుంబం రూపం మారుతుంది. అంతకంటె నీకూ, నీ భార్యకూ ఏం కావాలి?"

"నా భార్యతో చెప్తాను."

"ఆడవాళ్ళను అడగడం పురుష లక్షణం కాదు. మనం చెప్పింది స్త్రీలు చెయ్యాలి."

"నా భార్య నేను చెప్పినట్లే చేస్తుంది, సార్" అన్నాడు గంగరాజు నిషాలో.

రాత్రి తొమ్మిదింటికి గంగరాజు యింటికి చేరుకున్నాడు. బాటిల్ని భద్రంగా అలమారులో దాచుకుని అతడు వంటగదిలోకి వెళ్ళాడు.

గిరిజ చదువుకుంటోంది. తతిమ్మా పిల్లలు నిద్రపోతున్నారు.

సేట్ చెప్పినదంతా అతడు భార్యతో చెప్పాడు.

"మంచి సంబంధం. పోతే రాదు. దమ్మిడీ ఖర్చు లేకుండా పెళ్ళయిపోతుంది" అన్నా డతను.

"అమ్మాయి ఒప్పుకోవాలిగా?" అంది అతడి భార్య.

"దాన్ని నే నడగను. ఈ పెళ్ళి అయితే మనందరి గతీ బాగుపడ్తుంది. మనకి అది ముఖ్యం. మనం సుఖంగా జీవిస్తాం."

"మీ యిష్టం" అందామె.

చదువు మాని గిరిజ వాళ్ళ మాటలు విన్నది. గాభరాగా వంటింట్లోకి వెళ్ళింది.

"నా పెళ్ళి విషయం మాట్లాడుతున్నట్లున్నారు!" అందామె.

"అప్పుడే శుభవార్త నీ చెవిన పడిందన్నమాట!" అన్నాడు గంగరాజు.

"ఇది అశుభవార్త! గోకులదాస్ లాంటి దూదిబస్తాని నేను పెళ్ళాడను.

"మాటిచ్చేశాను. పెళ్ళి చేసుకతీరాలి. నువ్వు యీ పెళ్ళికి ఒప్పుకోకపోతే నా ఉద్యోగం వూడుతుంది. ఈ ఇల్లు మనం ఖాళీ చెయ్యాలి. అద్దె లేకుండా సేట్ మన్ని యీ ఇంట్లో వుండనిస్తున్నాడు" అన్నాడు తండ్రి.

"మీ సుఖంకోసం నన్ను బలిచేస్తారా?" అర్చిందామె.

"ఇది బలి కాదమ్మా. ఇంటిల్లిపాది నీ ఉద్ధరించిన దేవతగా నువ్వు అగుపిస్తావు" అంది తల్లి.

గిరిజ అక్కడనుంచి వెనక్కి తిరిగి వచ్చేసింది. తండ్రి బాగా తాగివున్నాడు. అతడితో ఎక్కువగా వాదిస్తే అరుస్తాడు. ఇరుగుపొరుగువాళ్ళు నవ్వుతారు.

గిరిజ పుస్తకాలను పక్కన పడేసి చాపమీద పడుకుంది. ఆలోచిస్తూ అలాగే వుండిపోయింది. ఈ పెళ్ళికి

తను ఒప్పుకోగూడదు! ఏదో చేసి తను తలిదండ్రుల అడక త్తెరలోంచి బయటపడాలి!

3

చీకటిపడ్తోంది. ఆ నాటి రాత్రి సేట్ గోకులదాస్ తండ్రితో యింటికొస్తాడు. యెక్కడికేనా పోవాలని ఆమె ఆలోచిస్తోంది.

కారు హారన్ విని ఆమె బయటకు వెళ్ళింది. గోపాలరావు మెర్సిడిస్ కారు ఆగివుంది. ఆమె కారు దగ్గరకు వెళ్ళి చూసింది. కారులో వనిత లేదు!

స్టీరింగ్ వీల్ వెనక గోపాలరావు వున్నాడు.

"ఎక్కమ్మా!" అన్నా డతను.

కారులో ఎక్కి ఆమె తలుపు మూసింది. అతడు కారును పోనిచ్చాడు.

"వద్దంటే వినకుండా వనిత మోపెడ్ మీద వెళ్ళి కిందపడింది. లక్కీ, కొద్దిగా దెబ్బలు తగిలాయి" అన్నా డతను.

"నా దగ్గర దాచకండి! బాగా దెబ్బలు తగిలేయా?" అడిగిందామె, కన్నీళ్ళతో.

"నువ్వే చూస్తావుగా!"

గూర్ఖా గేటు తెర్చాడు. మెర్సిడిస్ కారు లోపలకు వెళ్ళి పోర్టికోలో ఆగింది. ఇద్దరూ కిందకు దిగి, మెట్లెక్కి, పైకి వెళ్ళారు.

వనిత మోకాలుమీద, చేతిమీద కట్లు వున్నాయి. ఆమె బాగా నిద్రపోతోంది.

"నీకోసం వనత ఎన్నిసార్లో అడిగింది. డాక్టర్ ఇచ్చిన యింజక్షన్ మూలంగా ఆమె నిద్రపోయి వుంటుంది" అన్నాడు గోపాలరావు.

"పడుకోడం మంచిది" అంది గిరిజ.

అంతవరకూ అక్కడ కూర్చున్న మోహన్ వాళ్ళు రాగానే లేచి నుంచున్నాడు.

"మోహన్, అమ్మాయి ఏదేనా అడిగిందా?" గోపాలరావు అడిగాడు.

"గిరిజా! అని పిలుస్తూ నిద్రలోకి జారిపోయింది, సార్" అన్నాడు మోహన్.

వనిత పక్కనే కూర్చుంది గిరిజ. తండ్రి అక్కడే సోఫాలో కూర్చున్నాడు. మోహన్ కిందకు వెళ్ళి పోయాడు.

పదికావస్తోంది. వనిత యింకా లేవలేదు.

"మీరు వెళ్ళి భోజనం చేయండి, అంకుల్" అందామె.

"దెబ్బల బాధ తెలియకుండా వుండేందుకు డాక్టర్ యింజక్షన్ యిచ్చాడు. పడుకుని అది ఎప్పుడో లేస్తుంది. నువ్వూరా, భోజనం చేద్దాం" అన్నాడతను.

"అంకుల్, నే నిప్పుడు తినలేను. మీరు వెళ్ళండి"

గోపాలరావు కిందకు వెళ్ళాడు. భోజనం ముగించి హాల్లోకి వచ్చాడు. మోహన్ ఎదురయ్యాడు.

"సార్, ఏదేనా కావలిస్తే నాకు ఫోన్ చేసి చెప్పండి. ఎంత రాత్రయినా ఫరవాలేదు" అన్నాడు మోహన్.

గోపాలరావు అతడి చెయ్యి పట్టుకుని ఆప్యాయంగా నిమిరాడు.

"గుడ్ బాయ్!" అన్నాడు.

క్షణకాలం అతను మోహన్ వైపు చూస్తూ వుండి పోయాడు.

రెండేళ్ళ క్రితం తన కారుకు యాక్సిడెంట్ అయింది. అతను స్పృహతప్పి కారులోనుంచి కిందపడ్డాడు.

సైకిలుమీద పోతున్న మోహన్ అతడిని హాస్పిటల్లో చేర్చి, యింటికి ఫోన్ చేసి వనితతో అంతా చెప్పాడు. కోలుకున్నాక గోపాలరావు అతడికి వెయ్యి రూపాయలు యివ్వబోయాడు.

"మీరిచ్చే డబ్బు కరిగిపోతుంది, సార్. నేను బి.ఏ. పాసయ్యాను. నాకేదేనా ఉద్యోగం యివ్వండి. సాయ శక్తులా పని చేస్తాను" అన్నాడు మోహన్.

మోహన్ కి ఎవ్వరూ లేరు. అనాధాశ్రమంలో పెరిగి బి.ఏ. పాసయ్యాడు. అదంతా విని గోపాలరావు అతడిని తన సెక్రటరీగా వుండమన్నాడు.

"మోహన్, పదకొండు కావస్తోంది. వెళ్ళి పడుకో" అన్నాడు గోపాలరావు, మెల్లిగా లేస్తూ.

వనిత గాఢనిద్రలో వుంది. గిరిజ సోఫాలో పడుకుని ఏడుస్తోంది.

ఎదురుగా నిలబడి గిరిజవైపు అతడు చూశాడు.

"ఎందుకమ్మా, అంతగా ఏడుస్తావు? వనితకు ఏమీ అవదు. మరి కొన్ని గంటల్లో ఆమె లేచికూర్చుని నీతో కబుర్లు చెపుతుంది."

"వనిత గురించి కాదు, అంకుల్!"

అతడామె పక్కనే సోఫాలో కూర్చున్నాడు.

"ఏమిటో చెప్పమ్మా!" అన్నాడతను.

ఆమె ఏడుస్తూ వుండిపోయింది.

"ఏం జరిగిందో చెప్పు!"

"సేట్ గోకులదాస్ అనే ముసలి బస్తాకి నన్ను భార్యగా బలివ్వాలని అమ్మా, నాన్నా నిశ్చయించారు" అందామె.

"నువ్వు వద్దంటే అది ఆగిపోతుంది. దానికోసం

ఏడ్వడం అనవసరం" అన్నాడతను.

"అది అగదు. బలాత్కారంగా నా పెళ్ళి సాగిపోతుంది."

"నాన్ సెన్స్, నేను నిన్ను రక్షిస్తాను!"

"ఒక విధంగా రక్షించగలరు."

"ఎలాగో చెప్పు అలాగే రక్షిస్తాను."

ఆమె అతడివైపు సూటిగా చూసింది.

"మీరు నన్ను పెళ్ళాడండి!"

అతను త్రుళ్ళిపడ్డాడు. ఎదురుగా గోడమీదున్న పద్మ ఆయిల్ పెయింటింగ్ వైపు చూశాడు.

"గిరిజా ఏమిటి నువ్వనేది?"

"ముందుగా మీతో నా పెళ్ళి అయిపోతే వాళ్ళు ఏమీ చెయ్యలేరు."

"నా వయస్సు 46 యేళ్ళు. నువ్వు చిన్న పిల్లవి. నా కూతురులాంటి దానవు."

ఆమె గోడమీదున్న పద్మ ఆయిల్ పెయింటింగ్ వైపు చూసింది.

"మీరొక గొప్ప ప్రేమమూర్తి. మూడేళ్ళ జీవితంలో ఎన్ని జన్మలెత్తినా తరగనంత ప్రేమను మీ భార్యకు అందించారు. మీలాటి ప్రేమికుడికి వయస్సు లేదు!"

"గిరిజా, ఈ జీవితంలో నేనెవర్నీ పెళ్ళాడను. నా హృదయంలో పద్మరూపం జ్యోతిలా వెలుగుతోంది!"

"మీ కామెమీద ఎంత ప్రేముందో నాకు తెలుసు. నేను రోజూ చూస్తున్నాను. మీ భార్య స్థానాన్ని యెవ్వరూ ఆక్రమించుకోలేరని నాకు తెలుసు. నన్ను కాపాడ్డంకోసం మీరు నన్ను పెళ్ళాడాలి" అందామె.

"అదంత సులువుగా చేయగలిగిన పనికాదు."

"అంకుల్, డోంట్ బాదర్!" అయేదేదో అవుతుంది."

గోపాలరావు సమీపంలో వున్న తన పక్కమీద వాలి పడుకున్నాడు. అతడికి నిద్ర రావడంలేదు. తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. యెప్పుడు నిద్రపట్టిందో అతడికే తెలియదు.

ఏవో మాటలు విని అతడు మేలుకొని పక్క మంచం వైపు చూశాడు. గిరిజ, వనిత నవ్వుతూ కబుర్లు చెప్పుకుంటున్నారు. ఎంత మైత్రి వాళ్ళది!

బ్రెడ్ ముక్కలను, బిస్కట్లను గిరిజ ఆమె నోటికి అందిస్తోంది. వనిత హుషారుగా తింటోంది.

"ఇటువైన ఆ మోపెడ్ మీద వెళ్ళకు!" అంది గిరిజ.

"సిల్లీ గిరిజా! అలా యాక్సిడెంట్లు అవుతూనే వుంటాయి. మనం భయపడకూడదు. ఐ డోంట్ కేర్!" అంది వనిత చులకనగా.

4

తెల్లవారింది. గోపాలరావు మొహం కడుక్కుని కిందనున్న డైనింగ్ హాల్లోకి వెళ్లాడు. అక్కడ వనిత, గిరిజ సిద్ధంగా కూర్చుని వున్నారు.

"నీ రాకకోసం యెదురుచూస్తున్నాం, నాన్నా" అంది వనిత.

అతడు కుర్చీలో కూర్చుని గిరిజవైపు చూశాడు.

"నిన్న రాత్రి నీ స్నేహితురాలు భోజనం చేయలేదు. నీ పక్కన అలాగే కూర్చుని వుండిపోయింది" అన్నాడతను.

"గిరిజా, యిప్పుడు ఎక్కువగా తినాలి!" అంది వనిత.

ముగ్గురూ ఆకలితో టిఫిన్ తిన్నారు.

"అమ్మాయి, యివాళ కాలేజికి వెళ్ళకు!" అన్నాడతను.

"నేనూ వెళ్ళను" అంది గిరిజ.

"గిరిజా, నువ్వెళ్ళు. ఏం చెప్పాలో నాకు తెలుసుంది. నాన్నా, నువ్వు ఆఫీసుకు వెళ్ళేటప్పుడు గిరిజను కాలేజి దగ్గర డ్రాప్ చెయ్యి" అంది వనిత.

"అలాగేనమ్మా" అన్నాడతను.

వనిత దుస్తులు ధరించి, గిరిజ వెళ్ళి కారులో ముందు సీటుమీద కూర్చుంది. మోహన్ కారు పక్కగా నిల బడ్డాడు.

కారు ఎక్కబోతూ గోపాలరావు పక్కనున్న మోహన్ వైపు చూశాడు.

"మోహన్, నువ్వు కింగ్ అండ్ కంపెనీకి వెళ్ళి నేను చెప్పిందిచేసి ఆఫీసుకురా" అన్నా డతను.

"యస్సార్" అన్నాడు మోహన్ వినయంగా.

స్టీరింగ్ వీల్ వెనక గోపాలరావు కూర్చున్నాడు.

"బై బై !" అంది వనిత.

మెర్సిడెస్ కారును గోపాలరావు పోనిచ్చాడు. ఓరగా ఆమెవైపు చూశాడు. వేగంగా కారు రోడ్డమ్మట కదులోంది.

"గిరిజా, నీకు ఏ ప్రమాదం రాదు. ఒక విధంగా నీ పెళ్ళి జరుగుతుంది. నువ్వా గోకులదాస్‌కు బలవ్వవలసిన అవసరంలేదు" అన్నా డతను.

"అంకుల్, ధన్యవాదాలు" అందామె.

"గిరిజా, నీ కాలేజి బయటకు యెన్నింటికొస్తావు మధ్యాహ్నం?"

"నాలుగింటికి."

"నేను కాలేజి బయట వుంటాను. అక్కడినుంచి ఒక చోటకు వెళ్దాం" అన్నా డతను.

"ఎక్కడికి?"

"నువ్వే చూస్తావు" అని కారు ఆపా డతను.

ఆమె దిగి కాలేజివైపు వెళ్ళిపోయింది. అతడు కారును పోనిచ్చాడు.

నానాలాల్ అండ్ సన్స్ షాపు ప్రాంతంలో కారాపి అతడు దిగాడు. షాపులోకి వెళ్ళి కాస్సేపట్లో తిరిగి వచ్చాడు.

కారులో కూర్చుని తలుపు మూసి సిగరెట్ వెలిగించాడు. పొగ వదులూ క్షణకాలం ఆలోచించి టైమ్ చూశాడు. కారును స్టార్టుచేసి తన ఆఫీసువైపు వేగంగా పోనిచ్చాడు.

5

సేట్ గోకులదాస్ కోపంగా గంగరాజు వంక చూశాడు.

"ఎక్కడయ్యా నీ కూతురు? నన్ను యింటికి తీసుకెళ్ళావు. నీ భార్యకూ, పిల్లలకూ కొత్త గుడ్డలిచ్చాను. నీకు విస్కీబాటిల్ యిచ్చాను. కాని నీ కూతురు నాకు కనపడలేదు!" అర్చాడతను.

"అది స్నేహితురాలి ఇంటికి వెళ్ళింది. అది రాగానే మిమ్మల్ని మళ్ళా తీసుకెళ్తాను" అన్నాడు గంగరాజు.

"నేను రాను. దాన్నే యిక్కడకు తీసుకురా! తను కాపరం చేయబోయే యిల్లు ఒకసారి చూస్తుంది" అన్నాడు సేట్.

"అలాగే చేస్తాను" అన్నాడు గంగరాజు.

మధ్యాహ్నం నాలుగింటికి గోపాలరావు తన మెర్సిడిస్ కారును కాలేజి రోడ్డు మీద ఆపి కూర్చున్నాడు. కాస్సేపట్లో గిరిజ కారులో కూర్చుంది. అతడు కారును పోనిచ్చాడు.

పదినిమిషాల్లో ఒక యింటిముందు కారు ఆపాడు. చిన్న ఇల్లు. చుట్టూ కాంపౌండ్ వుంది. మోహన్ పరుగెత్తుకొచ్చాడు.

గోపాలరావు, గిరిజ దిగారు. కారులో వున్న పాకెట్టును మోహన్ తీసుకున్నాడు.

అందరూ ముందు హాల్లోకి వెళ్ళారు. చక్కటి సోఫాలున్నాయి. గోపాలరావు కూర్చుని, వాళ్ళను కూర్చోమన్నాడు. క్షణకాలం నిశ్శబ్దంగా వుంది.

గోపాలరావు మోహన్ వైపు సూటిగా చూశాడు.

"మోహన్, నీమీద నాకు చాలా నమ్మకం వుంది. అందుకే నిన్ను యిక్కడకు రమ్మన్నాను. గిరిజ తలిదండ్రులు బలవంతంగా ఆమెను ఎవడో సేట్ కిచ్చి పెళ్ళి చేయాలని నిశ్చయించారు. ఈ పెళ్ళంటే ఆమెకు ఇష్టం లేదు. మరో విధంగా తన పెళ్ళి ముగించి ఆ పెళ్ళిని ఆపాలని ఆమె ఆరాటం."

గోపాలరావు ఆగాడు. మోహన్ వైపు సూటిగా చూశాడు. మోహన్ ఎందుకో గాభరాపడుతున్నాడు.

"మోహన్, నువ్వు ఆమెను పెళ్ళాడాలని నా కోరిక."

"నన్ను క్షమించండి. నేను ప్రస్తుతం యెవర్నీ పెళ్ళాడను. ఈ విషయంలో మీరు మరో విధంగా భావించకండి" అన్నాడు మోహన్.

"మోహన్, ఖచ్చితంగా చెప్పినందుకు సంతోషం.

పెళ్ళి విషయంలో యెవరూ యెవర్నీ బలాత్కరించ కూడదు."

టేబుల్ మీదున్న పాకెట్ విప్పి అందులో వున్న పట్టుచీరను అతడు గిరిజ కిచ్చాడు.

"గిరిజా, ఆ గదిలోకెళ్ళి పట్టుచీర కట్టుకుని రా!" అన్నాడతను.

ఆమె పక్క గదిలోకి వెళ్ళి కాసేపట్లో తిరిగొచ్చింది.

"మోహన్, యిప్పుడు జరగబోయేదానికి నువ్వు సాక్షిగా వుంటావు. రేపు ఎప్పుడేనా అవసరమైతే నువ్వు నిజంచెప్పి గిరిజ భవిష్యత్తును కాపాడాలి."

"అలాగే సార్" అన్నాడు మోహన్.

గోపాలరావు ఆమెకు ఒక గొలుసును యిచ్చాడు. మంగళసూత్రాలు గొలుసులో అమర్చబడి వున్నాయి.

మోహన్ ఆ గొలుసువైపు ఆశ్చర్యంగా చూశాడు.

"గిరిజా, ఆ గొలుసును మెళ్ళో వేసుకో!"

ఆమె నవ్వుతూ వేసుకుంది.

"మోహన్, ఈ క్షణంనుంచీ మేము భార్యాభర్తలుగా నటించబోతున్నాం. మా యిద్దరి మధ్యా భార్యాభర్తలకుండే సంబంధాలు వుండవు. ఆమె నా యింట్లో వుంటుంది. కాని మేం వేరు వేరు గదుల్లో పడుకుంటాం. ఆమెను కాపాడ్డంకోసం నీ సమక్షంలో యీ విధంగా ఆమె పెళ్ళి జరిగింది. నువ్వంతా చూశావు."

"విచిత్రంగా వుంది, సార్" అన్నాడు మోహన్.

గోపాలరావు ఆమెవైపు నవ్వుతూ చూశాడు.

"గిరిజా, ఇది చాలుగా?" ప్రశ్నించాడు.

"చాలు, అంకుల్" అందామె.

ఆ నాటి రాత్రి ఎనిమిదింటికి గోపాలరావు ఆమెను

కారులో యింటికి తీసుకెళ్లాడు. ఆమె కారు దిగింది. గంగరాజు కారు దగ్గరకు పరుగెత్తాడు.

"ఎక్కడికి పోయావే?" అడిగాడు తండ్రి.

"పెళ్ళికి" అంది గిరిజ కుల్తంగా.

కారులో కూర్చున్న గోపాలరావు అంతా మౌనంగా వింటున్నాడు.

"ఎవరి పెళ్ళి?"

"నా పెళ్ళి" అందామె బుల్లెట్ లా.

"మాకు తెలియకుండా నీ పెళ్ళా?"

"ఇప్పుడు తెలిసిందిగా!" అందామె మంగళసూత్రాలను పైకి చూపిస్తూ.

"నిన్ను పెళ్ళాడిన వాడెవరు?"

"ఆయనే—నా భర్త!" అందామె గోపాలరావు వైపు చూపిస్తూ.

గిరిజ యింట్లోకి వెళ్ళింది. గంగరాజు నవ్వుతూ గోపాలరావు వైపు చూశాడు.

"ఎన్నో ఆశలతో యీ పిల్లను పెంచాను. దాన్ని జాగ్రత్తగా చూసుకోండి" అన్నాడు గంగరాజు.

"సేట్ గోకులదాస్ కంటె బాగానే చూస్తాను" అన్నాడు గోపాలరావు నవ్వుతూ.

"మాది పేద కుటుంబం. కాస్త మీరు మాకు సహాయం చేస్తూ వుండాలి."

"అదంతా గిరిజ చేతుల్లో వుంది."

గంగరాజు యింటివైపు పరుగెత్తాడు. కొంతసేపయ్యాక గిరిజ కారు దగ్గరకు వచ్చింది. తల్లిదండ్రులు, తమ్ముళ్ళు, చెల్లెళ్ళు మూకుమ్మడిగా ఆమె వెనకనే వచ్చారు.

గిరిజ కారులో కూర్చుని తలుపు మూసింది. ఎన్నేళ్ళ పాటో తను కలిసి జీవించిన వాళ్ళవైపు ఆమె దీనంగా చూసింది.

గోపాలరావు కారును పోనిచ్చాడు. ఆమె కిల కిల నవ్వసాగింది.

“గిరిజా, ఎందుకలా నవ్వుతున్నావు?”

“గోకులదాస్ యీ వార్త విని గుండెలు బాదు కుంటాడు. అదంతా ఆలోచిస్తే నవ్వొస్తోంది” అందామె.

6

పోర్టికోలో మెర్సిడిస్ కారు ఆగింది. వనిత ముందు వరండామీద నిలబడివుంది. కారులోంచి దిగిన గిరిజవైపు వనిత విచిత్రంగా చూసింది.

“హై గిరిజా! ఏమిటి పెళ్ళికూతురిలా వున్నావు?” అంది వనిత.

“పెళ్ళయిందిగా!” అంది గిరిజ.

“డోంట్ ఫుల్ మై లెగ్స్! పెళ్ళేమిటి?”

“నా పెళ్ళి యివాళే అయిపోయింది” అంది గిరిజ.

మౌనంగా గోపాలరావు వరండామీద నిలబడ్డాడు.

“నిన్ను పెళ్ళాడిన ఆ మూర్ఖుడెవడు?” అంది వనిత నవ్వుతూ.

“ఆయనే—మా నాన్న!” అంది గిరిజ.

కోపంతో వనిత మొహం ఎర్రబడింది. ఆమె తండ్రి వైపు కోపంతో చూసింది.

“నాన్నా!” అని భయంకరంగా అర్చింది.

“ఏమిటమ్మా, ఎందుకా ఖంగారు?” అన్నాడు గోపాలరావు మెల్లిగా.

“ఈ బోడిముండను పెళ్ళాడావా? అది నిజంకాదని

చెప్పు నాన్నా! ఈ చిరుగుడ్డల దిష్టిపిడతను పెళ్లాడలేదని చెప్పు!" అరిచింది వనిత.

ఆమె యిలా ప్రవర్తిస్తుందని అతడు కలలో కూడా వూహించలేదు. వాళ్ళ అన్యోన్యత ఒక్క క్షణంలో పటాపంచలవుతుందని అతడికి తట్టలేదు.

"వనితా, ఆమెను, నీ స్నేహితురాల్ని కాపాడ్డం కోసం యిది జరిగింది" అన్నాడు గోపాలరావు.

వనిత అమాంతంగా పైకి పరుగెత్తింది. తన గదిలోకి వెళ్ళి తలుపులు మూసుకుంది.

ఆమె వెనకనే పరుగెత్తాడు గోపాలరావు. తలుపు మీద దబదబ కొట్టాడు.

"అమ్మాయి, నేను చెప్పేది విను!" అరిచాడు.

ఆమె తలుపు తెరవలేదు. గోపాలరావు గుమ్మం బయట పచార్లు చేస్తున్నాడు.

గిరిజ పైకి వచ్చింది. అతడివైపు విచారవదనంతో చూసింది.

"గిరిజా, మీ స్నేహాన్ని ఏదీ దెబ్బకొట్టలేదని నేను అనుకునేవాడిని. ఆమె ప్రాణ స్నేహితురాలైన నిన్ను కాపాడాలని యిదంతా జరిపించాను. మనం చేసినది మన్నే బెడిసి కొట్టింది!" అన్నాడు గోపాలరావు.

గిరిజ తలుపును తట్టింది.

"వనితా, నన్ను లోపలకు రానీ!" అందామె.

"పో, నీ మొహం నాకు చూపించకు!"

"యూ ఫూల్, నా మాట విను!"

"నేను ఫూల్నే. అందుకే నిన్ను ఆదరించాను. నువ్వు వంగనాచివి. నాన్నను నీ వలలో యిరికించావు. పద్దెనిమిదేళ్ళ పవిత్ర ప్రేమను మంటగలిపి నాన్న హృదయంలోకి

కుమ్మరిపురుగులా దొల్చుకుపోయావు! నీకు కావలసింది నేను కాదు, నా స్నేహంకాదు, నాన్న. నాన్న ఆస్తి అదే నీకు కావాలి!" అర్చింది వనిత లోపలనుంచి.

కన్నీళ్ళతో గిరిజ అతడి దగ్గరకు తిరిగివచ్చింది.

"దురాలోచనలతో ఆమె మెదడు మండుతోంది. ఈ క్షణంలో ఏం చెప్పినా ఆమె వినదు!" అన్నాడు గోపాలరావు.

"అంకుల్, మీరు నన్ను క్షమించాలి. మిమ్మల్నీ, ప్రాణ సమానంగా పెంచిన మీ బిడ్డనీ విడగొట్టేనన్న అపకీర్తిని నేను భరించలేను" అందామె.

గోపాలరావు ఆమె వంక చూశాడు. కళ్ళమ్మట ధారలుగా నీళ్ళు కారుతున్నాయి. అంతా అయోమయంగా వుంది. చివరకి యిలా పరిణమిస్తుందని తను అనుకోలేదు.

"అంకుల్, నేను మా యింటికి వెళ్ళిపోతాను."

గోపాలరావు ఆమె చెయ్యి పట్టుకున్నాడు.

"తొందరపడకు. ఆమెలో చెలరేగే తుఫాను మాయమవుతుంది. అటుపైన మనం చెప్పేది ఆమె సవ్యంగా వింటుంది."

"ఇదంతా చూస్తూంటే నాకు చాలా బాధాకరంగా వుంది. వనితంటే నాకెంతో ప్రేమ. కాని ఆమె నన్ను మరో విధంగా చూస్తోంది."

గోపాలరావు ఆమెను సమీపంలో వున్న పక్క గదిలోకి తీసుకెళ్ళాడు. ఆ గదిలో మంచం, బీరువా వగైరాలన్నీ వున్నాయి.

"గిరిజా, నువ్వు యీ గదిలో వుండు!"

ఆమె తలాడించింది.

"ముందు నాకు చెప్పకుండా తొందరపడి ఏమీ చెయ్యకు! త్వరలో అంతా బాగుపడ్తుందని నా నమ్మకం."

"అలాగే, అంకుల్" అందామె.

గోపాలరావు బయటకు నడిచాడు. మోహన్ అతడి కెదురుగా వచ్చాడు.

"ఆమెతో నే వెళ్ళి నిజం చెప్పనా?" అన్నాడు మోహన్.

"నిజం చెప్పినా వినే స్థితిలో లేదు వనిత. తర్వాత చూద్దాం" అన్నాడు గోపాలరావు.

7

ఎనిమిదైంది. గిరిజ మెల్లిగా పక్కనున్న గోపాలరావు గదిలోకి వెళ్ళింది.

అతడు సోఫాలో కూర్చుని పేపరు చూస్తున్నాడు.

"టిఫిన్ కి రండి!" అందామె.

"వనితను పిలువు!"

గిరిజ మెల్లిగా వనిత గది ముందుకు వెళ్ళింది. తలుపు మూసి వుంది. లోయ్యగా నే తలుపు తెర్చుకుంది. ఆమె లోపలకు వెళ్ళింది.

వనిత పల్చటి మేక్సీలో వుంది. గదిలోకొచ్చిన ఆమె వైపు వనిత అసహ్యంగా చూసింది.

"బ్రేక్ ఫాస్టుకురా!"

"ఇది నీ యిల్లని నన్ను పిలుస్తున్నావా? నేను రాను. మీ రిద్దరూ వెళ్ళి తినండి."

గిరిజ కదల్లేదు. ఆమెవైపు చూస్తూ వుండిపోయింది.

"వనితా, నువ్వెందుకిలా నాకు దూరమయిపోయావు!"

వనిత పరిహాసంగా నవ్వింది.

"నాన్న నీకు దగ్గరయ్యాడు, నే నెందుకు?"

కోపంగా గిరిజ ఆమెవంక చూసింది.

"వనితా, పిచ్చిగా వాగకు! నీ తండ్రిని ఏదేనా అంటే నేను భరించను. ఆయన హృదయం ప్రేమతో నిండివుంది...."

"నిండి నిండి నీ వైపు వరదలా ప్రవహిస్తోంది!" అంది వనిత ఆడ్డొస్తూ.

"నా వైపు కాదు, నీ తల్లి పద్మవైపు. నీ తల్లి రూపం ఆయన హృదయంలో జ్యోతిలా వెలుగుతోంది."

"ఆ ప్రేమ జ్యోతిని నువ్వు ఆర్పేశావు!"

"నే నే కాదు యెవ్వరూ ఆర్పలేరు. చిక్కుల్లో యిరుక్కున్న నన్ను కాపాడ్డానికి పెళ్ళికాని యీ పెళ్ళి జరిగింది. భార్యాభర్తల్లా నటిస్తున్నాం అంతే. మా యిద్దరి మధ్యా ఏ సంబంధమూ లేదు."

"గిరిజా, ఈ కథలన్నీ మీ అమ్మకు చెప్పు! ఆమె నమ్మొచ్చు! భార్యాభర్తలుగా నటించేవాళ్ళు వుంటారని నా కింతవరకూ తెలియదు."

గిరిజ వెనక్కు తిరిగింది.

"మళ్ళా ఎప్పుడూ నా గదిలోకి రాకు! ఈ యింటి మీద నాకూ హక్కుంది. నా జీవితం నేను జీవిస్తాను. మీ జీవితం మీది."

విచారవదనంతో గిరిజ గోపాలరావు గదిలోకి వెళ్ళింది. జరిగినదంతా అతడితో చెప్పింది.

"ఇప్పుడు ఏం చేద్దాం?" అడిగింది.

"వనిత చెప్పింది చేద్దాం. మనిద్దరం వెళ్ళి టిఫిన్ తిందాం" అన్నా డతను.

కిందనున్న డైనింగ్ హాల్లో యిద్దరూ టిఫిన్ తింటూ కూర్చున్నారు.

వంటామె ట్రేలో ఏదో పట్టుకుని వెళ్తోంది.

"ఎక్కడికమ్మా?" అడిగాడు గోపాలరావు.

"వనితమ్మ బ్రేక్‌ఫాస్టు తన గదికి తెమ్మన్నారు" అని ఆమె వెళ్ళిపోయింది.

"గిరిజా, చూశావా, అమ్మాయి తింటోంది. తినడం మానలేదు. మరి కొన్నిరోజులు గడిస్తే ఆమె కిందకొచ్చి మన పక్కనే కూర్చుని తింటుంది" అన్నాడతను.

గిరిజ అతడివైపు అదోలా చూసింది.

"ఆమె అంతగా మారుతుందనే నమ్మకం నాకు లేదు?" అందామె.

"ఎందువలన అలా అంటున్నావు?" అడిగాడతను.

"హైస్కూల్లో మేరీ అనే అమ్మాయితో ఆమె చాలా స్నేహంగా వుండేది. యెందువలనో వాళ్ళ స్నేహం చెడింది. మేరీ అదే స్కూల్లో చదివింది. కాని వనిత ఆమెతో మళ్ళా మాట్లాడలేదు. నాతో స్నేహం చేసింది. మేమిద్దరం స్నేహితులమయ్యాం. ఇప్పుడు మా స్నేహం కూడా దెబ్బతింది" అందామె.

ఇద్దరూ టిఫిన్ ముగించి హాల్లోకొచ్చారు. సోఫాలో కూర్చున్నారు. మోహన్ వాళ్ళముందుకొచ్చాడు.

"ఏమిటి మోహన్?"

"మీ అమ్మాయి వ నిత మ్మ కి వెయ్యిరూపాయలు కావాలిట" అన్నాడు మోహన్.

"ఆమెకా డబ్బు కాష్‌బాక్స్‌లోంచి తీసి యివ్వు!"

"ఇస్తాను, సార్."

"మోహన్, మరో విషయం. మాకు దూరంగా వుండి వనిత పాడవడం నా కిష్టంలేదు. ఇటుపైన నువ్వు నాతో రావద్దు. వనితకు తెలియకుండా ఆమెను వెంటాడు. ఆమె

ఏం చేస్తున్నదీ, ఎవరెవర్ని కలుసుకుంటున్నదీ నాకు కావాలి" అన్నాడు గోపాలరావు.

"అలాగే సార్."

"నువ్వు వెంటాడుతున్నట్లు ఆమె తెలుసుకోకూడదు!"

"ఆమె కనుక్కోలేదు, సార్. మారు వేషంలో ఆమెను నేను వెంటాడతాను" అన్నాడు మోహన్.

"గుడ్ లక్, మోహన్" అన్నాడు గోపాలరావు.

8

ఫియట్ కారు తనే నడుపుతూ వనిత బయటకు వెళ్ళింది. ఆమె కారు గేటు దాటగానే మోహన్ స్కూటర్ మీద దూసుకుపోయాడు.

ఫియట్ కారు బీచ్ వైపు కదులుతోంది. బీచ్ లోపల రోడ్డుమీద కారాపి ఆమె దిగింది. సముద్రంవైపు వయ్యారంగా నడుస్తూ వెళ్ళింది.

ఆమె కారుకు కొంచెం దూరంలో స్కూటర్ ఆపి దిగాడు మోహన్. చిరిగిన పైజామా, జుబ్బాలో అతడు పేదవాడిలా వున్నాడు. అతిడి వయసు యాభైపైన వుంటుందని చూసినవాళ్ళు అనుకుంటారు.

సముద్రంవైపు వెళ్తూన్న ఆమెను చూసి మోహన్ ఫియట్ కారువైపు కదిలాడు.

ఇద్దరు యువకులు బోనెట్ ఎత్తి ఏదో చేస్తున్నారు. వాళ్ళ పక్కనుంచి మోహన్ మెల్లిగా కదులుతున్నాడు.

"ఆ పిట్టవచ్చి కారును స్టార్టుచేస్తుంది. కారు స్టార్టు అవదు. అప్పుడు నేను రంగంలోకొచ్చి రిపేరు చేస్తాను. కారు వెంటనే స్టార్టు అవుతుంది" అన్నాడో యువకుడు.

"మంచి ఐడియా!"

"పిట్ట డబ్బున్నదిలా వుంది. మన వల్లో పడ్తే పిండుకు

తాగొచ్చు."

మోహన్ వాళ్ళ సంభాషణ విన్నాడు. వెనక్కి తిరిగాడు. బోనెట్ మూసి ఇద్దరు యువకులూ దూరంగా జరిగారు. వాళ్ళవైపు చూశాడు మోహన్.

ఒక యువకుడు చూడ్డానికి చక్కగా వున్నాడు. ఖరీదైన పాంట్, స్లాక్ ధరించాడు. చేతికి మెరుస్తూన్న వాచ్ వుంది.

సముద్ర పొడ్డున యిసుకలో ఆమె కూర్చుంది. చీకటి పడింది. పక్కనుంచి నడుస్తూ ఆమె ఏడుస్తోందని మోహన్ గమనించాడు.

కొంత సేపయ్యాక వనిత కారువైపు నడిచింది. ఎంత ప్రయత్నించినా కారు స్టార్టు కాలేదు.

ఒక యువకుడు పక్కనుంచి వెళ్తూ, ఆగి ఆమెవైపు చూశాడు.

"మిస్, కారు స్టార్టు అవడంలేదా?" అడిగాడతను.

ఆమె తలాడించింది.

అతడు బోనెట్ ఎత్తాడు. పది నిమిషాలపాటు ఏదో చేశాడు. కారు స్టార్టు అయింది. అతడు బోనెట్ మూసి ఆమె పక్కకొచ్చాడు.

కృతజ్ఞతతో ఆమె అతడివైపు చూసింది.

"మీకు చాలా థాంక్స్" అందామె.

"డోంట్ బాదర్" అన్నాడతను.

అతడు పచ్చగా, పొడుగ్గా వున్నాడు.

"మీ పేరు?"

"విక్టర్ జోన్స్" అన్నాడతను.

"మీరు ఎందాకా వెళ్ళాలి?"

"మైలాపూర్" అన్నాడతను.

"ఎక్కండి, మిమ్మల్ని తోవలో దింపేస్తాను" అందామె.

"ఎందుకులెండి, నడిచిపోతాను" అన్నాడతను.

"ప్లీస్, ఎక్కండి!"

అతడు కారులో ఆమె పక్కనే కూర్చుని తలుపు మూశాడు. ఆమె కారును పోనిచ్చింది.

ఫియట్ కారు వెనకనే మోహన్ తన స్కూటర్ని పోనిచ్చాడు.

ఫియట్ కారు రోడ్డమ్మట వేగంగా వెళ్తోంది.

విక్టర్ జోన్స్ మారు పేరు. అతడి అసలు పేరు గణేష్.

"మీరు కారు బాగా నడుపుతున్నారు. లైసెన్స్ వుందా?" అడిగాడతను.

ఆమె నవ్వింది.

"లైసెన్స్ లేకుండానే నడుపుతున్నాను."

"150 రూపాయలు ఇస్తే టెస్టుకు వెళ్ళకుండా మీకు లైసెన్స్ వస్తుంది. నా మిత్రుడు ఆదినారాయణ ఇప్పించగలడు."

"నాకు లైసెన్స్ యిప్పించండి" అందామె.

"మీ పేరూ, అడ్రెసూ చెప్పండి" అందామె.

ఆమె చెప్పింది.

"మిస్టర్ విక్టర్ జోన్స్, మీరు ఏం చేస్తున్నారు?" ప్రశ్నించిందామె.

"అశోక్ లేలండ్ కంపెనీలో యింజనీర్ని."

"మీతో పరిచయం అయినందుకు సంతోషం" అందామె.

"మిమ్మల్ని కల్సుకున్నందుకు నేను ఆనందిస్తున్నాను"

అన్నాడతను.

కారు మైలాపూర్ దాటిపోయింది.

"మైలాపూర్ దాటిపోయాం" అందామె.

"మీతో వుంటే ఎక్కడున్నామో తెలియడంలేదు. మీరు నన్ను హిప్నటైజ్ చేసేశారు!"

ఆమె నవ్వింది. కారు ఆపింది.

"దిగి వెనక్కి వెళ్ళాలి" అన్నాడతను.

"వెనక్కి తీసికెళ్ళి దింపనా?"

"సారీ, అంత శ్రమ మీకు కల్గించను" అన్నాడతను కిందకు దిగుతూ.

బయట నిలబడి అతడు ఆమెవైపు చూశాడు. హేండ్ బాగ్ లోంచి రెండువందల రూపాయిలనోట్లు తీసి ఆమె అతడికిచ్చింది.

"ఇది లైసెన్స్ కోసం" అందామె.

"నా దగ్గర ఛేంజిలేదు. మీకు యాభై యివ్వాలి" అన్నాడతను.

"తర్వాత ఇవ్వొచ్చు. మనం ఎప్పుడు కల్సుకుందాం?" అందామె.

"రేపు సాయంత్రం, బీచ్ లో, అదేచోట" అన్నాడతను.

"గుడ్ నైట్ మిష్టర్ విక్టర్" అని ఆమె కారును పోనిచ్చింది.

కొంచెం దూరం ఆగిన స్కూటర్ అతడి పక్కనుంచి దూసుకుపోయింది.

హాల్లో లైట్లు వెలుగుతున్నాయి. సోఫాలో గోపాలరావు, గిరిజ కూర్చుని వున్నారు.

"బీచ్ లో ఒక యువకుడిని ఆమె కల్సుకుంది. అతడికి

కారులో లిఫ్ట్ యిచ్చింది" అన్నాడు మోహన్.

"ఎవరతను?" అడిగాడు గోపాలరావు.

"పేరింకా నాకు తెలియదు. కాని అతడు మోస గాడని చెప్పగలను" అని తను చూసినదంతా మోహన్ చిత్రించాడు.

"గుడ్ గాడ్!" అన్నాడు గోపాలరావు.

"అతడితో తిరగకుండా మనం చూడాలి" అంది గిరిజ.

"అతడు త్వరలో యిక్కడికి రావచ్చు. అప్పుడు ఆమెను హెచ్చరించండి" అన్నాడు మోహన్.

"అలాగే, మై గుడ్ బాయ్" అన్నాడు గోపాల రావు.

9

అడవి ప్రదేశం. టాంక్ వద్దున ఆమె కారు ఆపింది. ఇద్దరూ కిందకు దిగారు.

"ఈ చెరువులో స్నానం చేస్తే బాగుంటుంది" అన్నాడతను.

"లెటస్ స్విమ్, మిష్టర్ విక్టర్" అందామె.

అతడామె భుజంమీద చెయ్యివేశాడు.

"వనితా, నన్ను విక్టర్ అని పిలువు!" అన్నాడతను.

బేదింగ్ దుస్తులు ధరించి యిద్దరూ చెరువులోకి దూకారు. అరగంటపాటు ఈదుతూ స్నానం చేశారు. ఆమె పాదాలను అతను పట్టుకున్నాడు. ఆమె నవ్వింది. ఇద్దరూ వుషారుగా ఒడ్డుకు చేరుకున్నారు. పక్కపక్కనే గడ్డిమీద పడుకున్నారు.

"వనితా, ఐ లవ్ యూ!" అన్నాడతను.

సమీపంలోంచి తుపాకీ పేలిన చప్పుడు వినపడింది.

"ఎవరో వున్నారు!" అన్నాడతను.

ఇద్దరూ తొందరగా దుస్తులు మార్చుకున్నారు. కారులో కూర్చున్నారు. ఒకతను తుపాకీ పట్టుకుని ప్రత్యక్షమయ్యాడు. ఆకాశంలో ఎగిరే పక్షివైపు అతడు షూట్ చేశాడు. కాస్సేపట్లో అతడు ఎక్కడికో వెళ్ళిపోయాడు.

అతడు ఆమెను తనవైపు లాక్కున్నాడు. ఆమె యెర్రటి పెదిమలను బలంగా, ఆవేశంతో ముద్దెట్టుకున్నాడు.

"యూ ఆర్ కిల్లింగ్ మి!" అందామె.

"కిల్లింగ్ విత్ లవ్" అన్నాడతను.

ఆమె తీయగా నవ్వింది.

"విక్టర్, రేపు మా యింటికిరా" అందామె.

"మీ నాన్న ఏమంటాడో!" అన్నాడతను.

"నాన్న నీ గురించి ఆలోచించడు. నా వయసు పిల్లని నాన్న యీ మధ్యనే పెళ్ళాడాడు. ఆమెలో లీనమై వుంటాడు నాన్న" అందామె.

"అయితే వస్తాను" అన్నాడతను.

"నా కారు డ్రయివింగ్ లైసెన్స్ ఎప్పుడొస్తుంది?"

"రెండు మూడు నెలలు పడుతుంది. పోస్టులో మీ యింటికి వస్తుంది. 200 ఆదినారాయణకి యిచ్చాను. మిగిలిన యాభై అతడిని వుంచుకోమన్నాను" అన్నాడతను.

ఒక సాయంత్రం ఆరింటికి అతడు వనిత యింటికొచ్చాడు. పెద్దమనిషిలా కింద హాల్లోని సోఫాలో కూర్చున్నాడు.

గిరిజ అతడివైపు సూటిగా చూసింది.

"ఎవరు మీరు? ఏం కావాలి?" అడిగిందామె.

"నా పేరు విక్టర్ జోన్స్. మిస్ వనితకోసం వచ్చాను" అన్నాడతను.

అదే సమయంలో వనిత హాల్లోకొచ్చి అతడివైపు నవ్వుతూ చూసింది.

"హెూ విక్టర్, పద, వెళిపోదాం" అందామె.

"ఆమెను నాకు పరిచయంచేయి" అన్నాడతను.

"ఆమె నా స్టెప్ మదర్!" అంది వనిత.

విక్టర్, వనిత నవ్వుతూ మెట్లెక్కుతూంటే గిరిజ కింద నిలబడి వాళ్ళవైపు చూసింది. మోహన్ హాల్లో కొచ్చాడు.

"గిరిజగారూ!" అన్నాడు మోహన్.

"చెప్పండి" అందామె.

"విక్టర్ జోన్స్, అనే పేరుతో అతడు ప్రస్తుతం చలామణీ అవుతున్నాడు. అతడి అసలు పేరు గణేష్. ఒకసారి అతడు జైలుకి వెళ్ళి వచ్చాడు" అన్నాడు మోహన్.

ఆ రాత్రి విక్టర్ వనితతో ఆమె గదిలో భోజనం చేశాడు. రాత్రి పన్నెండుదాకా అతడు ఆమె గదిలో వున్నాడు. కారులో తీసుకువెళ్ళి ఆమె అతడిని దింపి తిరిగొచ్చింది. హాల్లోంచి ఆమె మెట్లవైపు వెళ్తోంది.

హాల్లోని పెద్ద సోఫాలో గోపాలరావు, గిరిజ కూర్చుని వున్నారు.

"వనితా!" పిల్చాడు గోపాలరావు.

ఆమె ఆగి తండ్రివైపు చూసింది. అతడు ఆమె దగ్గరకు వెళ్ళాడు.

"ఎవరతను?"

"నా ప్రియుడు నేను అతడిని పెళ్ళాడబోతున్నాను"

"మాకు చెప్పకుండా పెళ్ళాడ్తావా?"

"నాకు చెప్పి మీరు పెళ్ళిచేసుకున్నారా?" అడిగిందామె.

"నువ్వు నా కూతురివి. అతడు మంచివాడు కాదు. మోసగాడు. నిన్ను చివరకి మోసగిస్తాడు. నిన్ను కాపాడే బాధ్యత నాది" అన్నాడతను.

"గిరిజ మోసగత్తె. ఆమెను మీరు వదిలేశారా? అతడు ఏమైనా నాకు ఫరవాలేదు. అతడు నాకు నచ్చాడు. నేను అతడినే పెళ్ళాడ్తాను" అందామె.

"అతడు నాకు నచ్చలేదు!" అన్నాడు గోపాలరావు.

"అతడిని పెళ్ళాడేది నేను, నువ్వు కాదు నాన్నా!" అందామె.

"అతడు ఓసారి జైలుకెళ్ళి వచ్చాడు."

వనిత తండ్రివైపు సూటిగా చూసింది.

"ఆ అబద్ధపు వార్త ఎవరు చెప్పారు, గిరిజా? నేను సుఖంగా వుంటే మీరు చూడలేరా? నన్నెందుకిలా పీడిస్తున్నారు? మీ యిష్టప్రకారం మీరు పెళ్ళాడారు. నా యిష్టప్రకారం నన్ను పెళ్లాడనీయండి."

"వనితా, నేను గిరిజను పెళ్ళాడలేదు. మెళ్ళో మంగళసూత్రాలు ఆమే వేసుకుంది. నేను కట్టలేదు!"

"అబద్ధాలాడకు నాన్నా!"

"వనితా, ఆమె నీ స్నేహితురాలు. ఆమె తలిదండ్రులు ఆమెను బలవంతంగా సేట్ గోకులదాస్ అనే వృద్ధుడికిచ్చి పెళ్ళిచేయాలని నిశ్చయించారు. ఏడుస్తూ ఆమె అదంతా నాతో చెప్పింది. ఆ గండంనుంచి తప్పించడం కోసం ఆమెను పెళ్ళాడినట్లు నేను నటించాను. నువ్వెంతో

ఆమె నాకంటే!" అర్చాదతను బాధతో.

"నాన్నా, ఇదంతా నాకు చెప్పకు. నేను ఫూల్ని కాను. గిరిజ నా కళ్ళు తెర్పింది. జీవితం అంటే ఏమిటో నాకు అర్థమైంది" అని ఆమె మెట్లమ్మట పైకి వెళ్ళి పోయింది.

10

రెండు రోజులనుంచి వనిత కనబడ్డంలేదు. గోపాల రావు ఆఫీసుకు వెళ్ళడం మాని యింట్లో వుండిపోయాడు. గిరిజ, మోహన్ అతడి పక్కనే వున్నారు.

"ఆమె ఆ విక్టర్‌తో వెళ్ళింది సార్. నేను చూశాను. వాళ్ళ కారును నేను మిస్ అయ్యాను. వెతికి వెతికి వెనక్కు తిరిగి వచ్చాను ఆ రోజున" అన్నాడు మోహన్.

"విక్టర్ అడ్రెస్ తెలుసా?"

"తెలియదు, సార్. అతడికి యిల్లు లేనట్లుంది. పేవ్‌మెంటుమీద అతడు జీవిస్తూ వుండాలి."

"గుడ్ గాడ్!" అన్నాడు గోపాలరావు.

టెలిఫోన్ మ్రోగింది. మోహన్ రిసీవర్ని అందుకున్నాడు.

"మీకోసం, సార్" అన్నాడు మోహన్.

గోపాలరావు రిసీవర్ని అందుకున్నాడు.

"గోపాలరావు స్పీకింగ్!" అన్నా డతను.

"మిష్టర్ గోపాలరావు, నీ కూతురు వనిత మా దగ్గర క్షేమంగా వుంది. ఆమెతో వున్న విక్టర్ జోన్స్ మాతో పోట్లాడి కుక్కలా చచ్చాడు. నీకు ఆమె కావాలంటే మేం చెప్పినట్లు చెయ్యాలి" అందో కంఠం.

"ఏం చెయ్యాలో చెప్పండి."

"ఐదు లక్షలిస్తే ఆమె మీ యింటికి తిరిగివస్తుంది.

డబ్బు సిద్ధంగా వుంచండి. మళ్ళీ ఫోన్ చేస్తాను. పోలీసులకు రిపోర్ట్ చేస్తే నీ కూతురు చెక్కలు, ముక్కలు అవుతుంది."

అటువైపునుంచి రిసీవర్ పెట్టేసిన శబ్దం వినబడింది. రిసీవర్ పెట్టేసి గోపాలరావు సోఫాలో కూలిపోయాడు.

"ఏమైంది?" అడిగింది గిరిజ.

అంతా అతడు చెప్పాడు.

"విక్టర్ జోన్స్ చచ్చాడంటే నేను నమ్మను. అతడే యిదంతా చేయిస్తూ వుండాలి" అన్నాడు మోహన్.

రాత్రి పన్నెండయింది. టెలిఫోన్ మ్రోగింది.

గోపాలరావు రిసీవర్ ఎత్తి, "గోపాలరావు స్పీకింగ్!" అన్నాడు.

"డబ్బు రెడీగా వుందా?" అందో కంఠం.

"వుంది."

"పది లేక యాభై రూపాయిల నోట్లలో వుండాలి."

"అలాగే యిస్తాను."

"వెంటనే డబ్బు బాగ్‌లో పెట్టుకుని బయల్దేరు. విల్లివాకంరా. లెవల్ క్రాసింగ్ నుంచి ఐ.సి.ఎఫ్. రైలు పట్టాలు వెళ్తాయి. వాటమ్మట నడువు. ఫర్లాంగ్ దూరం వెళ్ళాక ఆగు. ఒక ముష్టాడు నీకు ఎదురవుతాడు. అతడికి ఆ బాగ్ యిచ్చి వెనక్కి వెళ్ళిపో. రెండులోపల వనిత మీ యింట్లో వుంటుంది."

"అలాగే చేస్తాను."

"మమ్మల్ని పట్టుకోడానికి ప్రయత్నిస్తే నీ కూతురి శవాన్ని పెట్లో పెట్టి నీ యింటికి పంపుతాం."

"ప్లీస్, అదంతా వద్దు. నేను మీకు డబ్బిస్తాను" అన్నాడు గోపాలరావు.

"కమ్ ఫాస్టు!" అందా కంఠం.

గోపాలరావు ఎదురుగా వున్న మోహన్ వైపు చూశాడు.

"మోహన్, బాగ్ లో ఐదులక్షలు రెడీగా వుందా?"

"వుంది, సార్."

"మనిద్దరం వెళ్దాం, పద" అన్నాడు గోపాలరావు.

"వాళ్ళకు యింత డబ్బు యిచ్చేద్దామా?" అడిగాడు మోహన్.

గోపాలరావు నవ్వాడు. ఒక పిస్టల్ని మోహన్ కి యిచ్చాడు. మరో పిస్టల్ని తన జేబులో వుంచుకున్నాడు.

"మోహన్, మనం పిరికిపందలం కాము. వాళ్ళని మనం పట్టుకుందాం" అన్నాడు గోపాలరావు.

"గుడ్ ఐడియా" అన్నాడు మోహన్.

గోపాలరావు కారు దగ్గరకు వెళ్ళాడు. గిరిజ కారు పక్కనే నిలబడింది. అతడామె భుజంమీద చెయ్యి వేశాడు.

"గిరిజా, వెళుతున్నాను. ఏమవుతుందో నాకు తెలియదు" అన్నాడతను.

"అంకుల్, జాగ్రత్త! మీరాకకోసం నేను యెదురు చూస్తూ వుంటాను" అంది గిరిజ.

గోపాలరావు, మోహన్ కారు ఎక్కారు. మెర్సిడిస్ కారును అతడు పోనిచ్చాడు.

కారు విల్లివాకం చేరుకుంది. వెనక క్రాసింగ్ దగ్గర అతడు కారు ఆపాడు. ఇద్దరూ కిందకు దిగారు. మోహన్ చేతిలో డబ్బున్న బాగ్ వుంది. ఐ. సి. ఎఫ్. పట్టాలమ్మట యిద్దరూ నడవసాగారు.

దూరంలో లైట్లు వెల్గుతున్నాయి. వాళ్ళు పట్టాలమ్మట

నడుస్తున్నారు.

పట్టాలు మలుపు తిరుగుతున్నాయి. ఒక ముష్టాడు అమాంతంగా వాళ్ళకు కనిపించాడు.

"అయ్యా, దానం చేయండి!" అర్చాడతను.

మోహన్ చేతిలో వున్న బాగ్‌ను గోపాలరావు తీసుకుని ముష్టివాడి కిచ్చాడు. అతడు గబగబా వెళ్ళిపో సాగాడు.

గోపాలరావు అతడి వెనకనే వెళ్తున్నాడు.

"వెళ్ళొద్దు! ప్రమాదం, సార్" అన్నాడు మోహన్.

"నాన్ సెన్స్, కమ్" అన్నాడు గోపాల్రావు.

కొంచెం దూరం యిద్దరూ వెళ్ళారు.

"మిస్టర్ గోపాలరావు, చేతులెత్తు!" అర్చారెవరో గంభీరంగా.

తృళ్ళిపడ్తూ గోపాలరావు వెనక్కి చూశాడు. మోహన్ పిస్టల్ అతడివైపు కేంద్రీకరించబడింది.

"మోహన్, నువ్వా!" అన్నాడు గోపాలరావు.

"నేనే! నువ్వు వెనక్కి వెళ్ళిపో!" విక్టర్ చచ్చాడు. నీ కూతురు నా చేతుల్లో వుంది" అన్నాడు మోహన్

"ద్రోహీ!" అర్చాడు గోపాలరావు.

మరుక్షణంలో పిస్టల్ పేలింది. అరుస్తూ మోహన్ నేలమీద కూలిపోయాడు. అతడి పక్కనే వంగి కూర్చు న్నాడు గోపాలరావు.

"నా కూతురు ఎక్కడుంది?"

మోహన్ కొన ఊపిరితో వున్నాడు.

"విక్టర్ జోన్స్‌తో ఆమె కూడా మరణించింది."

"ఎలా?"

"అతడిని మేం చంపాం. ఆమె ఆత్మహత్య చేసు

వుంది" అని మోహన్ శాశ్వతంగా కళ్ళు మూశాడు.

గోపాలరావు వేగంగా పరుగెత్తాడు. ముష్టివాడి చేతిలో వున్న బాగ్‌ను లాక్కున్నాడు. వేగంగా వెనక్కి నడిచాడు.

లెవల్ క్రాసింగ్ దగ్గరకు చేరుకున్నాడు. మెర్సిడిస్ కారులో ఎక్కాడు. కారును శరవేగంగా తన ఇంటి వైపు పోనిచ్చాడు.

మెర్సిడిస్ కారు పోర్టికోలో ఆగింది. పరుగెత్తుకుంటూ గిరిజ కారు దగ్గరకొచ్చింది. గోపాలరావు కిందకు దిగాడు.

"మీరు క్షేమంగా తిరిగొచ్చినందుకు సంతోషం" అందామె.

ఇద్దరూ పైనున్న పడగ్గదిలోకి వెళ్ళారు. లైట్లు ప్రకాశవంతంగా వెల్గుతున్నాయి.

బీరువాలో వున్న స్కాచ్ బాటిల్ని తీసి అతడు విస్కీ గ్లాసులో పోసుకుని, నీళ్ళు కలిపాడు. గడగడ తాగేశాడు. మళ్ళా విస్కీ గ్లాసులో పోసుకున్నాడు.

"మోహన్ ఎక్కడ?" అందామె.

"వనితతో వున్నాడు" అన్నాడతను.

"వనిత ఎక్కడుంది?" అడిగిందామె.

అతడు ఆమెవైపు సూటిగా చూశాడు.

"తన ప్రియుడు విక్టర్ జోన్స్‌తో ఆమె పైలోకానికి వెళ్ళిపోయింది. మోహన్ కూడా అక్కడికే వెళ్ళాడు" అన్నాడతను.

గిరిజ కళ్ళమ్మట నీళ్ళు కారుతున్నాయి. ఆమె వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"అంకుల్, నా మూలంగా అందరూ నాశనమయ్యారు.

నేను యీ ఇంట్లో వుండకూడదు. నేను పాపిష్టిదాన్ని. నేను వెళ్ళిపోతాను" అందామె.

అతడామెవైపు తీక్షణంగా చూశాడు.

"గిరిజా!" పిల్చాడు గోపాలరావు.

"చెప్పండి అంకుల్" అందామె.

"నువ్వుకూడా వెళ్ళిపోతే నా కెవరుంటారు, గిరిజా?" అని అతడు ఏడ్వసాగాడు.

ఆమె అతడిని సోఫాలో కూర్చోబెట్టింది. పక్కనే కూర్చుంది. గ్లాసులోని విస్కీని అతడు క్షణంలో తాగేశాడు.

"ఇంకా పొయ్యి, గిరిజా!" అర్చాడతను.

"ఇంక తాగొద్దు" అందామె.

"పద్మలా చెప్తున్నావు!" అన్నాడతను.

"నేను మీ పద్మనేమో!" అందామె నవ్వుతూ.

గోపాలరావు ఆమెవైపు ఆప్యాయంగా చూశాడు.

"గిరిజా, యింతవరకూ మనం భార్యాభర్తలుగా నటించాం. ఇటుపైన నటించడం అనవసరమనిపిస్తోంది. నాకు పిల్లలు కావాలి. నువ్వు వాళ్ళను కనాలి" అన్నాడతను.

ఆమె అతడివైపు ఆప్యాయంగా చూసింది.

"మీ ప్రేమను రుచిచూసే అవకాశం నాకు లభించినందుకు ఆనందిస్తున్నాను" అంది గిరిజ.

—: అయిపోయింది: —